# సంపాదకీయం

విజ్ఞాన భారతి అయిదవ సంచికకు స్వాగతం. ఈ సంచిక కొన్ని కారణాల వల్ల , పదిహేను రోజుల ముందే వెలువడుతోంది. ఇండియా వెళుతున్నాను గనక పత్రిక పనులు కొంచెం ముందుగానే ముగించుకుని బయల్దేరుతున్నాను. అందుచేత ఇది కాస్త పేజీలు తక్కువ వచ్చింది.

మొదటిసారిగా ఒక ధారావాహిక మొదలుపెడుతున్నాం. క్వాంటం సిద్ధాంతపు ఆవిష్కరణలకు దాదాపు వందేళ్లు నిండిన సందర్భంగా శ్రీమతి చాగంటి కృష్ణకుమారి గారు తాము లోగడ 1997 లో మిసిమి మాస పత్రికలో ప్రచురించిన క్వాంటం కథను, మార్పులు, చేర్పులు చేసి మనకు అందిస్తున్నారు.

శ్రీ ఆరి సీతారామయ్య గారు నల్ల మందు కథలో అది ఎలా ఒక వైద్య చికిత్సగా మొదలై, అంతర్జాతీయ వాణిజ్య వస్తువుగా పరిణమించి, సామ్రాజ్యాల మధ్య యుద్ధాలకు దారి తీసి, సమాజాలలో కుటుంబాల నాశనానికి కారణమై, మరొక పక్క విజ్ఞానాభివృద్ధికి ఎలా బాటలు వేసిందో విస్తృతంగా చెప్పుకుంటూ వచ్చారు.

విజ్ఞాన భారతి పత్రిక అనగానే, అచ్చులోనా అని కొందరు అడుగుతుంటారు. కాదు. ఇది అంతర్జాలంలో వెలువడే పత్రిక. నిజానికి మేము చేస్తున్న కొత్త ప్రయత్నానికి ఇది సరియైన మాధ్యమం అనిపిస్తోంది. ఇందులో మాకు అచ్చు పత్రికల కష్టాలు లేవు. అచ్చు పత్రికలకు పేజీలు కాపీల సంఖ్యను బట్టి ఖర్చు. ఎన్నో పత్రికలు ఆ ఖర్చులు భరించుకోలేక మూత పడవలసి రావడం మనకు తెలిసిందే. వైజ్ఞానిక సంబంధమైన పత్రికలు కొన్ని దాదాపు 70 ఏళ్ల క్రితము వెలువడి, మార్గదర్శకాలుగా నిలబడి దారి చూపినా అవి అతి కొద్ది కాలం లోనే మూత పడ్డాయి. అంతర్జాలంలో వెలయించే పత్రిక పుష్పక విమానం వంటిది. ఎన్ని పేజీలు వచ్చినా సమస్య లేదు, తనలో ఇముడ్చుకోగలదు. అయితే, ఇప్పుడు మన సమస్య ఖర్చు కాదు, వైజ్ఞానికి సాహిత్య రచయితలు దొరకడం.

ఈ పత్రిక మొదలైనది అమెరికాలోనే అయినా, పుట్టి పెరిగిన గడ్డపై మొదటి సమావేశం పెట్టుకోవాలన్న కోరికతో జూన్ 22న సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాజ గాన సభలో ఒక సమావేశం తలపెట్టాము. రచయితలను, ఔత్సాహికులను కలుసుకుని వారి నుంచి సముఖంలో వైజ్ఞానిక సాహిత్యం గురించి అభిప్రాయాలు వినవచ్చునని ఆశ.

చివరగా, ఎప్పటికప్పుడు వార్తలు సేకరించి అందించాలని మా తలంపు. కానీ, అందుకు కావలసిన క్రియాత్మక ప్రక్రియ సరిగా వీలుపడక పోయింది. వచ్చే సంచికల నుంచైనా ఆ లక్ష్యం నెరవేరగలదని ఆశిస్తున్నాం. ఎప్పటిలాగే మీ అభిప్రాయాలను మాకు తెలిజేయండి.

***